



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, పోలీసులు

చీకటి వెలుగుల రంగేళి.. జీవితమే ఓ దీపావళి



- రేపు నరకచతుర్దశి, దీపావళి పండుగ, ధనలక్ష్మీ పూజలు..
- శుక్రవారం వ్రతాలు
- వెలుగులతో కళకళలాడనున్న గృహాలు

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ బహుళ అమావాస్యనాడు వచ్చేది దీపావళి. ధన త్రయోదశి నాడు బంగారం కొనడం, చతుర్థశి నాడు మంగళ హారతులు, దీపావళి నాడు ధనలక్ష్మి పూజలు చేస్తారు. ఈ యేడు గురువారం మధ్యాహ్నం చతుర్థశి ఉంటూ 2 గంటల నుంచి అమావాస్య వస్తోంది. గురువారమే దీపావళి పండుగ, ధనలక్ష్మి పూజలు జరుపుకోనున్నారు. శుక్రవారం స్వాతి నక్షత్రంతో కూడిన అమావాస్య ఉండడంతో నోములు నోచుకోనున్నారు. వ్యాపార గృహ సముదాయాల్లో పూజల అనంతరం టపాసులు కాలుస్తారు. ప్రతి ఇల్లు కొత్త అల్లుళ్లతో సందడిగా మారగా ఇంటిల్లిపాది పిండి వంటలు తింటూ కబుర్లతో కాలక్షేపం చేస్తారు. పడిపోయిన, కొత్తవి, పంచుకునే నోములు శుక్రవారం ఆచరించవచ్చని పండితులు చెబుతున్నారు.

● దీపావళిని ఇలా జరుపుకోవాలి..

గురువారం మధ్యాహ్నం వరకు చతుర్థశి తిథి ఉన్నందున దేవుని వద్ద మంగళ హారతి వెలిగించాలి. ఆడపడచులు హారతులిచ్చి దిష్టి తీయగానే తలంటు స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించి లక్ష్మీపూజ చేసి నైవేద్యం సమర్పించాలి. అమావాస్య తిథి గురువారం మధ్యాహ్నం వస్తుండడంతో మధ్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు దీపావళి పూజలు జరుపాలి. నోములు, వ్రతాలున్న వారు కేదారీశ్వర, సత్యనారాయణ స్వామి వ్రతాలు శుక్రవారం ఆచరించవచ్చు.

● దీపావళి పండగ వెనుక ఇతిహాసం..

ద్వాపర యుగంలో ప్రాగ్జోతిష్యపురం రాజధానిగా నరకాసురుడు పరిపాలన చేస్తూ దేవ, మానవ జాతిని ఇబ్బందులకు గురి చేసేవాడు. ధర్మానికి భంగం కలిగించే పనులకు సహించని భూమాత, దేవతలు, ప్రజలు, శ్రీకృష్ణుడికి విన్నవించుకుంటారు. కృష్ణుడు సత్యభామతో కలిసి ఆశ్వయుజ చతుర్థశి నాడు నరకుడిని అంతం చేస్తారు. అది నరక చతుర్థశి. నరకాసుర వధానంతరం వచ్చిన సత్యభామ కృష్ణులకు అమావాస్య (చీకటి రోజు) నాడు ప్రజలు దీపాలను వెలిగించి మంగళ హారతులు, భాజాభజంత్రీలుతో స్వాగతం పలుకుతారు. ఆనాటి నుంచి దీపావళిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది.

● దీపాల వెలుగులు- టపాసుల మోతలు..

దీపావళి అనగానే వివిధ ఆకృతుల్లో ఉన్న ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తారు. వరుసలుగా దీపాలు వెలిగించి ఆ కాంతుల మధ్య వెలిగి పోతున్న గృహాలను చూసుకొని మురిసి పోతారు. అమావాస్య తిథి లక్ష్మీదేవికి ఇష్టం కావడంతో దీపాలు వెలిగించి అమ్మ వారికి పూజలు చేసి ఆహ్వానిస్తే ధనలక్ష్మి కృప ఉంటుందని విశ్వాసం.పూజల అనంతరంవివిధ రకాల టపాసులను, బాంబులను చిన్నా పెద్ద తేడా లేకుండా కాల్చి ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకుంటారు.

● భారీగా పెరిగిన టపాసుల ధరలు

జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో మంగళవారం దీపావళి టపాసులు, పూజా ద్రవ్యాల కొనుగోళ్ల సందడి నెలకొంది. మార్క్‌ఫెడ్ గ్రౌండ్, అంబేద్కర్ స్టేడియం, పద్మనగర్, ప్రకాశం గంజ్, నగర శివారు ప్రాంతాల్లో టపాసుల అమ్మకాలు జరుగుతున్నాయి. నెలలో చివరి రోజులు కావడంతో మంగళ వారం రాత్రికి అమ్మకాలు మందకొడిగానే సాగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు పేలుతున్నా కొనక తప్పడం లేదని వినియోగదారులు అంటున్నారు. టపాసుల ధర కిలోకు 550 నుంచి 700 వరకు రూపాయల వరకు పలుకుతుంది. విడిగా అన్ని రకాలు కలిపి కొంటే తక్కువలో తక్కువ 2,500 రూపాయల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. వినియోగదారులు తాహతుకు తగ్గట్లుగా కొనుగోలు చేస్తున్నారు. థౌజండ్ వాలా, ఫైథౌజండ్ వాలా సింగిల్, డబుల్ షాట్స్, రాకెట్స్, తారాజువ్వలు, సైరన్ టపాసులు, ఉల్లిగడ్డ, లక్ష్మీబాంబులకు గిరాకీ పెరిగింది. ఖర్చులు, రవాణా చార్జీలు పెరగడంతో ధరలు పెంచక తప్పడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. పూజాద్రవ్యాల సామాగ్రికి గిరాకీ పెరిగింది. పూలు, పండ్లు, పూజలకు, నోములకు కావాల్సిన వస్తువుల కొనుగోళ్లు బాగానే సాగుతున్నాయి. గుమ్మడికాయ 80 నుంచి 150 వరకు, పూలు మూరకు 25 చొప్పున అమ్ముతుండగా విడి



మిగతా 8వ పేజీలో....

పోలీసుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఇందిరాచౌక్ నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీసుల అమరవీరుల విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీతోపాటు ఏసీపీలు నరేందర్, వెంకటరమణ, వేణుగోపాల్, మాధవి, కాశయ్య, అమరవీరుల కుటుంబా సభ్యులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సైదాపూర్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

సైదాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ పోలీస్‌స్టేషన్‌ను కరీంనగర్ సీపీ అభిషేక్ మోహంతి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులంటే ప్రజలకు నమ్మకం కలిగేలా ప్రవర్తించాలన్నారు. ప్రజలకు పోలీసులపై ఉన్న దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టేలా మెదలాలన్నారు. నేరాల అదుపులో, శాంతి భద్రతల నివారణలో పోలీసుల పాత్ర బాగుండాలని తెలిపారు. పోలీసులు ప్రజలతో మమేకమై ఉండాలని, పోలీస్ వ్యవస్థకు మంచి పేరు తీసుకరావాలన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశమున్నందున సిద్ధంగా ఉండాలన్నారు. కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్, ఎస్సై సీహెచ్ తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



విధి నిర్వహణలోనే దీపావళి

- సంబరాలకు దూరంగా..
- విధుల్లో అగ్నిమాపకశాఖ ఉద్యోగులు
- 48 గంటలు డ్యూటీలోనే..

◆ కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి

7

ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఉషు పోటీలకు స్పందన

7

టపాసులు.. జాగ్రత్తలు

◆ కరీంనగర్ క్రైం, ఆంధ్రజ్యోతి

7



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సుభాష్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పెం డింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయా లని ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భీమా సాహెబ్ అన్నారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఫీజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయక పోవడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడు తున్నారన్నారు. జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో మంత్రులు, ఎమ్మెల్యేల కార్యాలయాలు ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, ఉపాధ్యక్షులు తిప్పా రపు రోహిత్, నాగుల శ్రీజ, ఇసాక్, సహాయకార్యదర్శి జోగేశ్వర్, జిల్లా కమిటీ నాయకులు అంబల సందేశ్, సుధీర్, సుష్మిత, సంతోష్, ఎండీ నిహాల్ పాల్గొన్నారు.

డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల

కరీంనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని కరీంనగర్, చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ నియోజకవర్గాల పరిధిలో ఓటర్లుగా నమోదైన 10,79,058 మంది వివరాలతో డ్రాఫ్ట్ ఓటరు జాబితాను విడుదల చేసినట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ నియోజకవర్గంలో 3,66,646 మంది, చొప్పదండిలో 2,34,501, మానకొండూర్‌లో 2,26,567, హుజూరాబాద్‌లో 2,51,344 మంది ఓటర్లున్నట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 5,28,823 మంది పురుష, 5,50,174 మంది మహిళలు, 61 మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా, 588 మంది పురుషులు, 30 మంది మహిళలు సర్వీస్ ఓట ర్లుగా ఉన్నారన్నారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేర్లు లేని పక్షంలో నవం బర్ 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో నవంబరు 9,10 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకొని ఓటరుగా నమోదు కావాలని సూచించారు.

సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన మధిర తహసీల్దార్ కార్యాలయం నుంచి సమగ్ర ఇంటింటి సర్వేపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ విధి విధానాలను మంత్రివర్గంలో ఆమోదించామని అన్నారు. ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాలను ఈ సర్వేలో సేకరిస్తామని అన్నారు. సర్వే నిర్వహణకు అవసరమైన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లను గుర్తించి వారికి అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. గ్రామ, మండల, జిల్లా స్థాయి అధికారులను ఎంపిక చేయాలని, సీఆర్పీ, గెస్ట్ టీచర్ల సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. నవంబరు 6 నుంచి సర్వే ప్రారంభించాలని, కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ధరణి పాస్ పుస్తకాలు కుటుంబం దగ్గర ఉంచుకునేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా చేపట్టాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణ చరిత్రలో నిలిచేపోయే ప్రక్రియ అవుతుందని రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సీఎస్ నుంచి క్షేత్రస్థాయి అధికారి వరకు సమన్వయంతో పనిచేస్తూ ఏ తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహణ షెడ్యూల్ ప్రజలకు తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కలెక్టర్లకు సూచించారు. ధాన్యం కొనుగోలుపై మంత్రి సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లో నిర్దేశిత ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ధాన్యం దిగుబడి నిల్వలను బట్టి అవసరమైతే ఇంటర్మీడియట్ గోడౌన్లను సిద్ధం చేసు కోవాలని సూచించారు. మిల్లింగ్ చార్జీలు గతంలో చాలా తక్కువగా ఉండేవని, వీటిని పెంచేందుకు కేబినెట్ సబ్‌కమిటీ సిఫారుసు చేసిందన్నారు.

● సర్వేకు ఏర్పాట్లు చేయాలి

రాష్ట్ర ప్రభుత్వం సామాజిక విద్య, ఆర్థిక ఉద్యోగ, రాజకీయ కుల అంశాలపై నిర్వహించే సర్వేకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఇంటింటి సర్వే ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబరులో నిర్వహించే ఇంటింటి సర్వేకు అధికారులు సన్నద్ధం కావాలన్నారు. మండలాల వారీగా ఎంపీడీవోలు, తహసీల్దార్లు ఎన్యుమరేటర్లను ఎంపిక చేసి వారి వివరాలను బ్లాక్‌ల వారీగా అందజేయాలన్నారు. డిజిటలైజేషన్ కోసం డేటా ఎంట్రీ ఆపరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 150 కుటుంబాల బాధ్యత అప్పగించాలన్నారు. అన్ని కుటుంబాల డాటాను ఎన్యుమరేటర్‌లు సేకరించాలన్నారు. సర్వే చేసిన ఇళ్లకు స్టిక్కర్ అంటించాలన్నారు. సర్వేను ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంట్లో నివసించే వారి సంఖ్య, ఆధార్, రేషన్ కార్డులు, భూముల సమగ్ర వివరాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఆర్డీవో శ్రీధర్, జడ్పీ సీఈవో పవన్‌కుమార్, సీపీవో కొమురయ్య పాల్గొన్నారు.



ఆహో.. మ్యూజికల్ ఫౌంటేన్

- తుది దశకు మల్టీపర్పస్ పార్కు పనులు


కరీంనగర్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మల్టీపర్పస్ పార్కు పనులు తుది దశకు చేరుకున్నాయి. ఆరు ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో పార్కు పనులు చేపడుతున్నారు. నవంబరులో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. మంగళవార ం సాయంత్రం ఆయన పార్కులో పనులను పర్యవేక్షించి మ్యూజికల్ వాటర్ ఫౌంటేన్ ట్రయల్ రన్‌ను పరిశీలించారు. రంగురంగులతో మిరిమిట్లు కొల్పడమే కాకుండా చక్కటి మ్యూజిక్‌తో ఏర్పాటు చేసిన వాటర్ పౌంటన్ ట్రయల్ రన్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు అందమైన ఆహ్లాదకరమైన పార్కును అందించాలనే లక్ష్యంతో మల్టీపర్పస్ పార్కును అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పార్కు పనులతోపాటు చారిత్రక కట్టడమైన ఓల్డ్ హైస్కూల్ భవనాన్ని ఆధునీకరించి కలరింగ్, లైటింగ్ సిస్టమ్‌తో చారిత్రక చిహ్నంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. పార్కుకు వచ్చే సందర్శకుల కోసం ఫుడ్ స్టాల్స్ వాహనాల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తున్నామని, పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. నవం బరులో పార్కును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.













నేటి నుంచి ధర్మపురిలో దీపాలంకరణ

నవంబరు 1న సహస్ర దీపాలంకరణ

ధర్మపురి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో ఈనెల 30 నుంచి నవంబరు 1 వరకు మూడు రోజుల పాటు దీపాలంకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ఏటా మూడు రోజుల పాటు ఆలయంలో ధనలక్ష్మి పూజలు వైభవంగా ఉత్సవాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈనెల 31న సాయంత్రం స్వామివారి ఊరేగింపుసేవ, నవంబరు 1న సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ప్రధాన ఆలయంలో సాయంత్రం 5-30గంటలకు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆయన వివరించారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడి రిమాండ్

జమ్మికుంటరూరల్ అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు నామని సత్యనారయణ మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. తమ కాలనీలో నివాసం ఉండే బాలికకు జామకాయలు ఇస్తానని నమ్మబలికి ఇంట్లోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు బాలిక ఏడవడంతో ఎవరికైనా చెబితే చంపేస్తా అంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఏడ్చుకుంటూ ఇంటికి వెళ్లిన బాలికను చూసిన తల్లి ఏం జరిగిందని ఆరా తీసింది. దీంతో జరిగిన విషయం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ప్రభుత్వ ఉపాధ్యాయుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

● **ఉపాధ్యాయుడి సస్పెన్షన్**

పెద్దపల్లి కల్చరల్ : ఓదెల మండలం పెద్ద కొమిరె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్పెషల్ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తున్న నామని సత్యనారాయణను విధుల నుంచి సస్పెండ్ చేశామని జిల్లా విద్యా శాఖాధికారి డి మాధవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరు ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైందని, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేశామని పేర్కొన్నారు.

మిర్జంపేట పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిర్జంపేట గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న బీ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులకు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజర్ అయిన శ్రీనివాసుకు పలుమార్లు మెమోలు కూడా జారీచేసి ఈనెల 26వ తేది వరకు విధులకు హాజరుకావాలని చివరి అవకాశం ఇచ్చినా విధుల్లో చేరకపోవడంతో సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఉత్తర్వులో పేర్కొన్నారు.



స్వశక్తితో ఎదుగుతూ..

ప్రభుత్వం అందిస్తున్న రుణాలతో మహిళలు స్వశక్తిగా ఎదుగుతున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులతో ఇంట్లో భర్త ఒక్కడే సంపాదిస్తే సరిపోదని మహిళలు కూడా ఎదో ఒక విధంగా సంపాదిస్తూ చేదోడువాదోడుగా నిలుస్తున్నారు. ముగ్గురు, నలుగురు కలిసి ఒక స్వంతంగా వ్యాపారం పెట్టుకుని లాభాలు గడిస్తున్నారు. కిరాణం షాపు, టైలరింగ్, పేపర్ ప్లేట్లు ఇలా రకరకాల బిజినెస్‌లలో విజయవంతంగా సాగుతూ కటుంబ ఆర్థిక కష్టాల నుంచి బయటపడుతున్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు

వ్యాపారంలో రాణిస్తున్న మహిళలు

ఆదర్శంగా నిలుస్తూనే..

మరికొందరికి ఉపాధి కల్పిస్తూ..

జగిత్యాల క్రైం/అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో మహిళలు స్వశక్తితో వ్యాపారాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. వ్యాపారంలో పురుషులతో పోటీ పడుతూ మరి కొంత మంది మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. మార్కెట్‌లో వస్తున్న ఆధునికత వైపు అడుగులు వేస్తూ వ్యాపారవేత్తలుగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంటూ తోటి మహిళల్లో పోటీతత్వం పెంచుతున్నారు. ఇప్పటికే టైలరింగ్, కిరాణం, పాల డెయిరీలు, పేపర్ ప్లేట్ల తయారీ ఇలా అనేక వ్యాపారాల్లో మహిళలు రాణిస్తున్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మహిళలు కూడా తమ వ్యాపారాలను ఆధునిక పోకడలకు అణుగుణంగా అమలు చేస్తున్నారు. జగిత్యాలలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)ద్వారా రుణాలు పొంది వ్యాపార రంగంలో రాణిస్తున్న మహిళలపై ప్రత్యేక కథనం...

రెండు దశాబ్దాలుగా ఉపాధి పొందుతూ..

జగిత్యాల పట్టణంలోని వాణినగర్ ప్రాంతానికి చెందిన కొండబత్తిని జయశ్రీ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరింది. రూ. 20 వేల రుణం పొంది చిన్నగా లేడీస్ ఎంపోరియాన్ని ఏర్పాటు చేసి నేడు రూ. 10 లక్షలతో తన వ్యాపారాన్ని వృద్ధి చేసి మరో ఇద్దరు మహిళలకు ఉపాధి కల్పిస్తోంది.

మక్క అటుకుల నుంచి.. మ్యాచింగ్ సెంటర్ వరకు

జగిత్యాలలోని పోచమ్మవాడకు చెందిన ఉప్పాడ దుర్గాదేవి స్త్రీనిధి పథకంలో చేరి బ్యాంకు ద్వారా రూ. 3లక్షల రుణాన్ని పొందింది. పదేళ్ల క్రితం తొలుతగా మక్క అటుకుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి మక్క అటుకుల దుర్గక్కగా పేరు తెచ్చుకుంది. నేడు మ్యాచింగ్, సారీ సెంటర్‌ను ఏర్పాటు చేసి మరో 10 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది.

బ్యూటీ పార్లర్ వ్యాపారం వైపు....

ఒకప్పుడు బ్యూటీ పార్లర్ అంటే పట్టణ ప్రజలకే పరిమితమయ్యేది. కానీ నేడు గ్రామీణ ప్రాంత మహిళలు, యువతులు ఫ్యాషన్ టెక్నాలజీలో రాణిస్తూ బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేసి పట్టణ మహిళా వ్యాపారులకు తామేమి తక్కువ కాదనే దిశగా రాణిస్తున్నారు. జగిత్యాల రూరల్ మండలం సోమన్‌పల్లికి చెందిన సిద్ధం సునీత జిల్లా కేంద్రంలో గ్రామీణ మహిళల స్వయం ఉపాధి(సెర్ప్) కింద రూ. 3 లక్షల బ్యాంకు రుణం పొంది బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంత యువతులకు తన వ్యాపారాన్ని పరిచయం చేస్తూ ఉపాధి పొందుతోంది.





పిండి వంటలు చేస్తున్న మహిళలు, బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న సునీత

పది మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యం..

ఉప్పాడ దుర్గాదేవి, జగిత్యాల



ఉపాధి పొందుతూనే మరో 10 మందికి ఉపాధి కల్పించడమే నా ప్రధాన లక్ష్యం. మార్కెట్‌లో పోటీ తత్వం రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. వినియోగ దారులకు అణు గుణంగా నాణ్యమైన బట్టలను అందిస్తూ ఉపాధి మార్గాలను ఎంచుకుంటున్నాం. పట్టణ పేదరిక నిర్మూ లన సంస్థ అందించిన ప్రోత్సాహంతోనే వ్యాపారాన్ని వృద్ధి చేశాను.

మహిళలు వంటింటికే పరిమితం కావద్దు...

కొండబత్తిని జయశ్రీ, వాణీనగర్, జగిత్యాల



మహిళలు వంటింటికే పరిమితం కావద్దు. ఉపాధి మార్గాల వైపు ఆలోచించాలి. పోటీ ప్రపంచానికి అణుగుణంగా నడుచుకుని వ్యాపార రంగంలో రాణించాలి. 18 ఏళ్లు నిండిన ప్రతీ యువతి మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి పొదుపులో భాగస్వామి కావాలి.

యూరప్, గల్ఫ్ దేశాలకు పిండి వంటలు

శాంత, మహిళ



కథలాపూర్ మండల కేంద్రంలో గత ఏడాది ప్రధానమంత్రి ఫామలైజేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్ఎంఈ) పథకం కింద రు. 2 లక్షల రుణం తీసుకుని ధనలక్ష్మీ పిండి వంటల పేరిట దుకాణం ప్రారంభించాము. ఈ రుణంలో 35 శాతం సబ్సిడీ అందిస్తోంది. రుచిగా ఉండటంతో ఆర్డర్లు విపరీతంగా పెరిగాయి. గారెలు, చకినాలు, మురుకు వంటి వంటకాలు కిలోకు రు. 300 చొప్పున విక్రయిస్తున్నాం. అమెరికా, లండన్ దేశాల్లో ఉన్న వారికి వారి బంధువులు, తల్లిదండ్రులు తమ వద్ద ప్రత్యేకంగా ఆర్డర్ చేసి పంపిస్తున్నారు. ఆదాయం ఆశించిన స్థాయిలో ఉండడంతో ఉపాధి పొందుతున్నాం.

కురాడు కుండలు..గరిగె బుడ్లు, ఐరేండ్ల డెకరేషన్...

వివాహాలు, వివిధ శుభకార్యాల్లో వస్తున్న ఆధునిక హంగులతో మార్కెట్‌లో కొత్త పుంతలు తెస్తూ మంచి డెకరేషన్ వ్యాపారవేత్తగా జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన తాటిపల్లి కావ్య రాణిస్తోంది. వివాహ వేడుకల్లో ఉపయోగించే ఐరేండ్లు, గరిగ బుడ్లు, కురాడు కుండలు, పెళ్లి కూతురు చేతిలో పట్టుకునే కొబ్బరి బొండాం తదితర వస్తువులకు అందం, రంగు వచ్చే విధంగా డెకరేషన్ చేస్తూ ఉపాధి పొందుతోంది. నాలుగేళ్లుగా తన వ్యాపారాన్ని జగిత్యాల నుం చి కరీంనగర్, వరంగల్, సిద్ది పేట జిల్లాలకు విస్తరించడంతో పాటు మరో ఎనిమిది మంది మహిళలకు ఉపాధి కల్పి స్తోంది. మెప్మా సంస్థ మరింత చేయూ తనందించాలని కావ్య కోరుతోంది.



కొండగట్టులో భక్తుల రద్దీ

మల్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరాగ స్వామి వారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు చేశారు. అనంతరం బేతాళుడిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



కొండగట్టు అంజన్న ఆలయ ఆవరణలో భక్తులు

జమ్మికుంటలో బాలుడి మృతి

● **వైద్యుల నిర్లక్ష్యంటూ తల్లిదండ్రుల ఆరోపణ**



మృతి చెందిన చిన్నారి అయాన్ష

జమ్మికుంట అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి) జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రిలో బాలుడు మృతి చెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలుడు మృతి చెందాడని బంధువులు ఆరోపిస్తున్నారు. జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన సూరం నరేష్-అనూష దంపతులకు అయాన్ష (1) బాలుడు ఉన్నాడు. రెండురోజుల క్రితం జ్వరం రాగా పట్టణంలోని ఓ పిల్లల ఆసుపత్రికి తీసుకువచ్చారు. అర్ధరాత్రి సమయంలో జ్వరం తీవ్రత ఎక్కువ అయింది. పిట్స్ కూడా వస్తుండడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యంలో బాలుడు మృత్యువాత పడ్డాడు. అక్కడి వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేదు. మంగళవారం బాలుడి మృతదేహంతో ఆసుపత్రికి చేరుకున్న బాలుడి తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే బాలుడు మృతి చెందాడని ఆరోపించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు బాలుడి కుటుంబసభ్యులతో మాట్లాడి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నరసింహుడి సన్నిధిలో భక్తులు పూజలు





నృసింహుడిని దర్శనం చేసుకుని పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి అను బంధ ఆలయాల్లో మంగళవారం భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివా సా చార్యులు, అర్చకులు స్వామి వారలకు పంచోపనిషత్తులతో అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకం, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం, నరసిం హ హోమం జరిపించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యం లో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు..

పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం



అవిశ్వాస తీర్మాన పత్రం అందజేస్తున్న డైరెక్టర్లు

ముస్తాబాద్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డిపై డైరెక్టర్‌లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మంగళవారం తీర్మానాన్ని జిల్లా సహకార అధికారి రామకృష్ణకు అందజేశారు. చైర్మన్ పనితీరులో అసంతృప్తి వ్యక్తం చేస్తూ తొమ్మిది మంది డైరెక్టర్‌లు ఈ నిర్ణయానికి వచ్చినట్లు పేర్కొన్నారు.

గంజాయి కేసులో ముగ్గురి రిమాండ్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో ముగ్గురిని రిమాండ్ చేశారు. డీఎస్పీ చంద్రశేకర్ రెడ్డి మంగళవారం వివరాలు వెల్లడిం చారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సదిమెల అభినయ్, రంగారెడ్డి జిల్లా కీసరకు చెందిన కాంతి సాగర్ గణేశ్, మేడ్చల్ మల్కాజిగిరికి చెందిన మాపు జోయెల్ వంశీకి ఇన్‌స్ట్రాగ్రాంలో పరిచయం ఉంది. కాంతి సాగర్ గణేష్, వంశీ సిరిసిల్లలో ఉన్న అభినయ్‌కి ఎల్లమ్మ సర్కిల్ వద్ద మంగళవారం గంజాయి అమ్ముతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 440గ్రాముల గంజాయి, మూడు మొబైల్స్, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు.

బాబ్లీ గేట్ల మూసివేత

● **హాజరైన త్రిసభ్య కమిటీ సభ్యులు**

జగిత్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువన మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను త్రిసభ్య కమిటీ పర్యవేక్షణలో మంగళవారం మూసివేశారు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం ప్రతీ యేటా జూలై 1వ తేదిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను తెరిచి, అక్టోబరు 29వ తేదీన మూసివేస్తారు. దీని ప్రకారం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు, నాందేడ్ ఇరిగేషన్ అధికారులు, సీడబ్ల్యూసీ అధికారుల బృందంతో కూడిన త్రిసభ్య కమిటీ సమక్షంలో బాబ్లీ గేట్లను మూసివేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్ రావు, సీడబ్ల్యూసీ ఈఈ వెంకటేశ్వర్లు, నాందేడ్ ఈఈ సీఆర్ బాన్‌సోడ్, ఎస్సారెస్పీ పోచంపాడ్ ఈఈ చక్రపాణి, డీఈ గణేష్, ఏఈఈ రవి, సీడబ్ల్యూసీ ఎస్‌డీఈ సతీష్ కుమార్ పాల్గొన్నారు.



బాబ్లీ గేట్ల మూసివేతలో పాల్గొన్న ఎస్సారెస్పీ అధికారులు

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరి మృతి

జగిత్యాలరూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల మండలం తిప్పన్నపేటలోని గడిగడ్డ ప్రాంతంలో మంగళవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల రూరల్ మండలం గుట్రాజ్‌పల్లికి చెందిన బొద్దుల నగేష్ (35) జగిత్యాల లోని ఫైర్ స్టేషన్ పక్కకు గల పంక్చర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. పని ముగించుకొని జగిత్యాల నుంచి తన స్వగ్రామం గుట్రాజ్‌పల్లి గ్రామానికి స్కూటీ వాహనంపై వెళ్తున్న క్రమంలో తిప్పన్నపేట గ్రామంలోని గడిగడ్డ వద్ద జగిత్యాల వైపు వస్తున్న మరో ద్విచక్రవాహనం నగేష్ ప్రయాణిస్తున్న స్కూటీని ఢీకొట్టింది. దీంతో నగేష్ రోడ్డుపై పడిపోయాడు. గుర్తుతెలియని లారీ నగేష్ తల పై నుంచి వెళ్లింది. దీంతో మెదడు భాగం ఛిద్రమై అక్కడిక్కడే నగేష్ మృతిచెందాడు. మరో ద్విచక్రవాహనం పై ప్రయాణిస్తున్న జగిత్యాలలోని హన్‌మాన్‌వాడ ప్రాంతానికి చెందిన ఇద్దరికి స్వల్పగాయాలైనట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎస్సై సధాకర్ పరిశీలించారు. మృతదేహాన్ని జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.



నగేష్ ఫైల్

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తంగళ్లపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్ గ్రామానికి చెందిన రాచర్ల బాలయ్య (63) చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బాలయ్య, ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నయంకాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. సోమవారం రాత్రి పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న బాలయ్యను సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

కొడిమ్యాల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన మ్యొర్రి దేవయ్య(74) అనే వృద్ధుడు మంగళవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతి చెందాడని కొడిమ్యాల హెడ్ కానిస్టేబుల్ అర్జ రాజు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు దేవయ్యకు సుమారు 30 ఏళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని మందులు వాడినా కడుపు నొప్పి తగ్గక పోవటంతో జీవి తంపై విరక్తి చెంది ఈనెల 18న ఇంటిలో క్రిమి సంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. మంగళవారం మధ్యాహ్నం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుని కుమారుడు మ్యొర్రి లింగమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ..

మల్యాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు సమీపంలోని శ్రీయాన్స్ హోటల్ వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు దుర్మరణం చెందారు. వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేములవాడ నుంచి జగిత్యాల వెలుతుండగా రహదారి దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తి(48)ని ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. బస్సు ఆపకుండా వెళ్లగా ఓ కారు వ్యక్తి దాని వెనుకాల వెళ్లి మెహర్‌బాబా సెంటర్ వద్ద ఆపాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై నరేశ్‌కుమార్ సంఘటన స్థలం పరిశీలించి మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆసుపత్రికి, ఆర్టీసీ బస్సును మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆటో ఢీకొని వృద్ధుడు..

కథలాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోసానిపేట ఎల్లమ్మ శివారులో వేములవాడ-కోరుట్ల రహదారిపై టాటా ఏస్ వాహనం ఢీకొని తోట లింగం (66) అనే వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం...లోడింగ్ ఆటో కోరుట్ల నుంచి సిద్ధిపేటకు మక్కల లోడ్‌తో వెళ్తుండగా తాండ్ర్యాల నుంచి స్వగ్రామం దుంపెటకు బైక్‌పై వస్తున్న లింగంను ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలైన లింగం అపస్మారక స్థితిలోకి వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రామగిరి మండలం సింగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన దండవేన నర్సయ్య(39) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసైన నర్సయ్య ఏపని చేయకపోవడంతో భార్య లలితతో పలుమార్లు గొడవలు జరిగాయి. రెండు రోజుల క్రితం భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో లలిత గ్రామంలోని తల్లిగారింటికి వెళ్లింది. మంగళవారం నర్సయ్య బంధువు సాగర్ ఇంటికి వచ్చాడు. తలుపు వేసి ఉండడంతో కిటికీ నుంచి ఇంట్లో చూడగా నర్సయ్య ఉరి వేసుకున్న విషయాన్ని గమనించాడు. మద్యానికి బానిస కావడం, జీవనోపాధి లేక భార్యతో గొడవలు జరగడంతో మనస్థాపానికి గురై నర్సయ్య ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ప్రసాదరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వీర్నపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని పెద్దవాగు వంతెన వద్ద రోడ్డు ప్రమాదంలో బెస్త గోపాల్ గాయపడ్డాడు. మండల కేంద్రానికి చెందిన గోపాల్ మంగళవారం రాత్రి పాల కేంద్రంలో పాలుపోసి తిరిగి వస్తున్నాడు. వాహనం అదుపుతప్పి పెద్ద వాగు వంతెన వద్ద వంతెన పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంతలో పడిపోయాడు. దీంతో గోపాల్ తలకు, కాలుకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఒకరిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రానికి అడ్డగుట్ల ప్రవీణ్ అనుమతి లేకుండా టపాసులు విక్రయిస్తున్నాడని పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఇంట్లో టపాసులు అమ్ముతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించారు. రూ.74,310 విలువైన టపాస్లును స్వాధీనం చేసుకున్నట్లు, ప్రవీణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

ఉరి వేసుకొని సింగరేణి కార్మికుడి ఆత్మహత్య

రామగిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఏపీఏ డివిజన్ పరిధి ఏఎల్‌పీలో పనిచేసే జనరల్ మజ్దూర్ కార్మికుడు సర్వార్ హుస్సేన్ (38)కార్మికుడు సోమవారం రాత్రి క్వార్టర్స్‌లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్న సర్వార్ హుస్సేన్ మనస్థాపానికి గురై సెంటినరీకాలనీలోని ఎస్‌టీటూ1265 నంబరుగల క్వార్టర్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు.

వరకట్న వేధింపులతో వివాహిత ఆత్మహత్య

చందుర్తి, అక్టోబరు 29: (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం నర్సింగాపూర్‌లో అదనపు కట్నం వేధింపులతో వివాహిత మంగళ వారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. బోయినపల్లి మండలం జగ్గారావుపల్లికి చెందిన కొంపెల్లి శంకరమ్మ, కనకయ్య-దంపతుల కుమార్తె అపర్ణ (27) వివాహం చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన ఆరెల్లి శంకర్‌తో జరిగింది. పెళ్లి సమ యంలో రూ.2 లక్షలతోపాటు ఇతర లాంఛనాలు ఇచ్చారు. పెళ్లి సమ యంలో ద్విచక్ర వాహనం ఇవ్వాల్సి ఉండగా ఆర్థిక ఇబ్బందులతో ఇవ్వలేక పోయారు. కొద్ది నెలల నుంచి ద్విచక్ర వాహనంతోపాటు, అదనంగా మరో లక్ష రూపాయలు కట్నం ఇవ్వాలని శారీరకంగా, మానసికంగా హింసించడంతో రెండు మార్లు నర్సింగాపూర్‌లో పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. మంగళవారం ఉదయం ద్విచక్ర వాహనంతో పాటు, అదనంగా లక్ష రూపాయల కట్నం తీసుకురావాలని భర్త శంకర్, అత్త లచ్చవ్వ, మామ రాజయ్య వేధించడంతో తన కూతురు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకుందని అపర్ణ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాబు తెలిపారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాదిన్నర జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం దొంగతనం కేసులో పెద్దగుండవెల్లికి చెందిన పంజా చందుకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.100 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ మంగళవారం తీర్పు వెల్లడించారు. ప్రాషిక్యూషన్ వివరాల ప్రకారం... ముస్తాబాద్ మండల కేంద్రంలోని బకెట్ బిర్యానీ హోటల్ యజమాని తన్నీరు నరేందర్‌రావు ఆగస్టు 17, 2023న హోటల్ ఎదుట తన ద్విచక్రవాహనాన్ని పార్క్ చేశాడు. అనంతరం వాహనం కనిపిం చకపోవడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు చందును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి ఎస్సై శేఖర్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. పీపీ సందీప్ కేసు వాదించగా కోర్టు కానిస్టేబుల్ ఆడేపు దేవేందర్ సాక్షులను ప్రవేశపెట్టారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన మేజిస్ట్రేట్ నిందితుడికి ఏడాదిన్నర జైలు శిక్ష, రూ. 100 జరిమానా విధించారు.

విధి నిర్వహణలోనే దీపావళి

- సంబరాలకు దూరంగా.. విధుల్లో అగ్నిమాపకశాఖ ఉద్యోగులు
- 48 గంటలు డ్యూటీలోనే..
- భోజనం కూడా కార్యలయంలోనే..

ఏ పండుగైనా కుటుంబసభ్యులతో జరుపుకుంటే సంతోషకరంగా, ఆనందభరితంగా ఉంటుంది. అందులో రంగురంగుల టపాసులు, క్రాకర్స్‌తో దీపావళి పండుగ మరింత ముఖ్యమైనది. అగ్నిమాపకశాఖ ఉద్యోగులు మాత్రం ఇంటికి, కుటుంబసభ్యులకు దూరంగా విధినిర్వహణలో నిమగ్నమై అందరి ఇళ్లలో వెలుగులు నింపడమే పెద్దపండగగా భావిస్తారు. పండగ రోజు అప్రమత్తంగా ఉంటూ ఎప్పుడు ఎలాంటి కాల్ వస్తుందో? ఎక్కడ ఎలాంటి అగ్ని ప్రమాదం సంఘటన వార్తను వినాల్సి వస్తుందో? అనే ఉత్కంఠతో గడుపుతారు. ఫలానా చోట అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం అందగానే క్షణాల్లో ఫైరింజన్‌తో సహా సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూస్తారు.



ఫైర్ స్టేషన్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజున అందరి ఇళ్లు దీపాలతో, టపాసుల మోతతో వెలుగులు విరజిమ్ముతూ ఉంటాయి. అగ్నిమాపకశాఖ ఉద్యోగులు మాత్రం ఇంటికి, కుటుంబ సభ్యులకు దూరంగా విధినిర్వహణలో నిమగ్నమై ఉంటారు. అందరు పండుగను ఘనంగా జరుపుకుంటే... అగ్నిమాపకశాఖ ఉద్యోగులు మాత్రం ఆ రోజున ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నిరంతరం అప్రమత్తతతో విధుల నిర్వహణలో ఉంటారు. దీపావళి పండుగ రోజున కుటుంబంతో సంబరాలు చేసుకోవాలని అందరి మాదిరిగానే వారికి కూడా ఆశలున్నప్పటికీ ఆ కోర్కెను తీర్చుకోలేని పరిస్థితి అగ్నిమాపకశాఖ ఉద్యోగులది. పండగ రోజు అప్రమత్తంగా ఉంటూ ఎప్పుడు ఎలాంటి కాల్ వస్తుందో? ఎక్కడ ఎలాంటి అగ్ని ప్రమాదం సంఘటన వార్తను వినాల్సి వస్తుందో? అనే ఉత్కంఠతో గడుపుతారు. ఫలానా చోట అగ్ని ప్రమాదం జరిగిందని సమాచారం అందగానే క్షణాల్లో ఫైరింజన్‌తో సహా సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూస్తారు. దీపావళి, మరుసటి రోజున కలిపి 48 గంటలపాటు అగ్నిమాపక సిబ్బంది విధి నిర్వహణలోనే ఉంటారు.

దీపావళి రోజున భార్య, పిల్లలు, కుటుంబసభ్యులందరితో కలిసి సంబరాలు జరుపుకునే అవకాశం ఉండదు. ఈ రెండు రోజులు అగ్నిమాపకశాఖ ఉద్యోగులు భోజనాలు కూడా ఫైర్ స్టేషన్‌లోనే కానిచ్చేస్తారు. దీపావళి పండుగరోజున భార్యపిల్లలతో కలిసి గడపలేదని భావన ఒక పక్క ఉన్నప్పటికీ మరో పక్క వారి విధి నిర్వహణ గుర్తుకు వస్తుంటుంది. ప్రజల కోసం తమ సంతోషాన్ని త్యాగం చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సేవలు అభినందనీయం.

ఫైర్ స్టేషన్‌లోనే దీపావళి పండుగ...



అగ్నిమాపకశాఖలో ఉద్యోగం కాబట్టి దీపావళి పండుగ మాకు ఫైర్ స్టేషన్‌లోనే గడిచిపోతుంది. దీపావళి రోజు, మరుసటి రోజున మాకు సెలవులు ఉండవు. భార్యాపిల్లలతో వేడుకలు జరుపుకోవాలని ఉన్నా విధి నిర్వహణ ముఖ్యం కాబట్టి అలాంటి ఆలోచన రానీయం. విధి నిర్వహణ ముఖ్యం. ప్రజలు సంతోషకరంగా, ఎలాంటి అగ్నిప్రమాదాలు చోటుచేసుకోని వాతావరణంలో దీపావళి పండుగ సంబరాలు చేసుకునే విధంగా రక్షణ, భద్రత కల్పించే బాధ్యత మాపై ఉంటుంది. దీపావళి పండుగకు పదిరోజుల ముందు నుంచే టపాసుల మూలంగా ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయి? ప్రమాదాల నియంత్రణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుంటాం. అయినా కూడా అక్కడక్కడ ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. అగ్నిప్రమాదాలు సంభవించిన సమాచారం అందుకున్న నిమిషాల్లో అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేయటంతో ప్రాణనష్టం నివారించటం, ఇదే మాకు విధి నిర్వహణలో తృప్తినిస్తుంది.

- ఎం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్(డీఎఫ్‌వో)

ప్రజల రక్షణే మాకు దీపావళి...



ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు సంతోషకరంగా వేడుకలు జరుపుకోవడమే మాకు దీపావళి పండుగ. ప్రజలందరి సంతోషమే మా పండుగగా భావిస్తాం. 37 ఏళ్లుగా అగ్నిమాపకశాఖలో ఉద్యోగం చేస్తున్నాను. ఏనాడు దీపావళికి మాకు సెలవులు ఉండవు. పిల్లలకు క్రాకర్స్ కొనిచ్చి జాగ్రత్తగా కాల్చుకోమని డ్యూటికి వస్తాను. దీపావళి రోజు భోజనాలు కూడా ఫైర్ స్టేషన్‌లోనే కానిస్తాం. విధి నిర్వహణ ముఖ్యంగా భావిస్తాం, కుటుంబ సభ్యులు కూడా అర్థం చేసుకుని సహకరిస్తారు.

- ఎం గుండయ్య, కరీంనగర్ ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్

రెండు రోజులు ఫైర్ స్టేషన్‌లోనే...



దీపావళి పండుగకు రెండు రోజులు ఫైర్ స్టేషన్‌లోనే విధుల్లో ఉంటాం. దీపావళి రోజున టపాసులు కాలుస్తున్నప్పుడు ప్రమాదాలు జరుగుతుంటాయి. ఈ సమయంలో ఎప్పుడు, ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఫైర్ స్టేషన్‌లో అనునిత్యం అప్రమత్తంగా ఉంటాం. దీపావళి పండుగ రోజున ఎలాంటి అగ్ని ప్రమాదం జరగకుండా చూడాలని దేవుడిని వేడుకుంటాం. తన పదేళ్ల సర్వీసులో ఎప్పుడూ కుటుంబ సభ్యులతో దీపావళి వేడుకలు జరుపుకోలేదు. ప్రజలు సంతోషకరంగా పండుగలు జరుపుకొనే వాతావరణం, రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఫైర్ సిబ్బందిపై ఉంటుంది. ఎట్టి పరిస్థితిలో ఈ బాధ్యతలను నుంచి పక్కకు వెళ్లే అవకాశముండదు. దీపావళి పండుగకు కుటుంబ సభ్యులతో గడపలేకపోతున్నామనే కొంత వెలితి ఉన్నప్పటికి విధినిర్వహణ ముఖ్యంగా భావిస్తాం.

- వి శ్రీనివాస్, ఫైర్‌మన్

న్యూస్ బాక్స్

రాజన్నను దర్శించుకున్న కమిషనర్


ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ నర్సయ్య

వేములవాడ కల్చరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వర స్వామిని డిజేబుల్ వెల్ఫేర్, వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటి జన్ ట్రాన్స్ జెండర్ కమిషనర్ శైలజ మంగళవారం దర్శించుకున్నారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వదించారు.

సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ హక్కులు, రాయితీల అమలు తీరుపై సమీక్ష


మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

గోదావరిఖని, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో ఎస్సీ, ఎస్టీ హక్కులు, రాయితీల అమలు తీరుపై మంగళవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. సింగరేణి సీఎండీ బలరాం నాయక్, డైరెక్టర్ (పీపీ, పర్సనల్) జీ వెంకటేశ్వర్‌రెడ్డి, వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, సింగరేణి చీఫ్ లైసెన్ ఆఫీసర్ దుర్గం రామచందర్, సింగరేణిలో ఉన్న అన్ని ఏరియా లైసన్ ఆఫీసర్లు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ పులిమోహన్‌లతో సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి చీఫ్ లైజర్ ఆఫీసర్ ఆధ్వర్యంలో జీఎం (ఐఆర్‌పీఎం) లైసెన్ ఆఫీసర్లతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీలలో లైసెన్ ఆఫీసర్లను విధిగా నెంబరుగా ఉంచడానికి నిర్ణయించారు. ఈ సమీక్ష సమావేశంలో అసోసియేషన్ నాయకులు యాట ఓదేలు, గంగారపు లింగమూర్తి, ఆరెపల్లి రామచందర్, గోడ రమేష్, ప్రవీణ్ కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

లక్ష్య సాధనకోసం నిరంతరం శ్రమించాలి

- రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్


గురుకుల పాఠశాలల స్పోర్ట్స్ మీట్‌లో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్య సాధన కోసంనిరంతర శ్రమ అవసరమని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు చదువుకునే హక్కు ఉందన్నారు. రాబోయేకాలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకల్పనకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. తమ ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్ర మంలో మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారా యణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు.

రాష్ట్రంలో క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే విజయరమణారావు


విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే జయరమణారావు

సుల్తానాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడారంగానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ గ్రామంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల విద్యాలయంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లాస్థాయి గురుకుల విద్యాలయాల క్రీడా పోటీలలో విజేతలకు మంగళవారం బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో, ఒలంపిక్స్ క్రీడల్లో తెలంగాణ సత్తా చాటాలని సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని ఇందులో భాగంగా క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తూ అధిక నిధులు కేటాయిస్తూ సీఎం కప్ వంటి క్రీడలను నిర్వహిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు కలుగుతుందన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, బల్మూరి వెంకటరమణారావు, గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులతో పాటు ముస్త్యాం రవీందర్, అబ్బయ్య గౌడ్, సతీష్, సాయిరి మహేందర్ పాల్గొన్నారు.

క్రిబ్‌కో సభ్యుడిగా ఎన్నికైన చొప్పదండి పాక్స్ చైర్మన్

చొప్పదండి, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): క్రిబ్‌కో ఎరువుల కంపెనీ ఆర్‌జీబీ సభ్యుడిగా చొప్పదండి ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం చైర్మన్ వెల్మ మల్లారెడ్డి ఎన్నికయ్యారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సహకార సంఘాల చైర్మన్ లు ఐదుగురు ఎన్నిక కాగా అందులో చొప్పదండి సహకార సంఘం చైర్మన్ మల్లారెడ్డి ఒకరు. కాగా మల్లారెడ్డిని మంగళవారం క్రిబ్‌కో స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ రామకృష్ణయ్య అభినందించారు.

ఉమ్మడి జిల్లా బాలికల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారిణులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ అకాడమిక్ హైట్స్ స్కూల్ క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలికల జట్టు ఎంపిక పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యమానికి అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ యాదగిరి సుజిత్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరిం చాలన్నారు. ఉమ్మడి జిల్లా జట్టు రాష్ట్రస్థాయి పోటీల్లో విశేష ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలన్నారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మంది బాలికలు హాజరై ప్రతిభచాటారు. ప్రతిభ చాటిన క్రీడాకారు లను నవంబరు 2, 3, 4 తేదీల్లో ఆసిఫా బాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీల కు ఎంపిక చేశారు. పోటీలను ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ శిరీషరావు, హ్యాండ్‌బాల్ సంఘ సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్, పీఈటీలు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ ఉషు పోటీలకు స్పందన

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ఫండస్ పాఠశాలలో నిర్వహించిన అండర్-17 బాలబాలికల ఉష పోటీలకు విశేష స్పందన లభించింది. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి సుమారు 120మంది బాలబాలికలు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన క్రీడాకారులను నవంబరు 2 నుంచి 4 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. అంతకుముందు ఈ పోటీలను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మస్థైర్యానికి, ఆత్మవిశ్వాసానికి ఉష క్రీడ ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇటీవల కాలంలో ఉష క్రీడకు ఆదరణ వస్తుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ గోపు పద్మజాప్రభాకర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో పాఠశాలలో ఉష క్రీడలో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ పోటీల నిర్వహణలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య కార్యదర్శి బి వేణుగోపాల్, టీఎన్‌జీవో ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, ఉష సంఘం కార్యదర్శి బార విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.


ఉమ్మడి జిల్లాస్థాయి ఉష పోటీల్లో పోటీపడుతున్న బాలికలు

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల రద్దు : ఎస్‌జీఎఫ్

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబర్ 29 (ఆంధ్ర జ్యోతి): కొత్తపల్లి మండల కేంద్రంలోని తేజస్ డిఫెన్స్ అకాడమీలో నిర్వహించిన 68వ రాష్ట్ర స్థాయి బాలబాలికల ఆర్చరీ పోటీలను రద్దు చేసినట్లు రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, జిల్లా అండర్-19 ఎస్‌జీఎఫ్ పోటీల నిర్వహణ కార్యదర్శి జి.మధుజాన్సన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. బాసర ఐఐటీ నుంచి నిర్మల్‌కు చెందిన క్రీడాకారిణి ఈపోటీల్లో పాల్గొనడం, తెలంగాణ జువెనల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్ (జైలు)కు చెందిన ఓపెన్ విద్యార్థి పోటీల్లో పాల్గొనడం, అండర్-14, అండర్-17 క్రీడాకారులు వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలకు చెందిన అండర్-19 విభాగంలో పాల్గొన్నట్లు తెలి యడంతో ఈ పోటీలను రద్దుచేసినట్లు తెలిపారు. అలాగే నిర్మల్, హన్మ కొండ జిల్లాల స్పోర్ట్స్ అథార్టీ అధికారులు ఈపోటీలకు అండర్-14,17 క్రీడాకారులను పంపించారని, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్ జిల్లాల నుంచి కూడా అండర్ 14,17 వారు పాల్గొనడంతో అండర్-19 క్రీడాకారులకు అన్యాయంజరిగినట్లు క్రీడాకారుల తల్లిదండ్రులు ఆందోళన చేయడంతో పోటీలను రద్దు చేసినట్లు తెలిపారు.

- ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్ 19 ఆర్చరీ క్రీడలను కొత్తపల్లిలోని తేజాస్ అకాడమిలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా విద్యార్థులకు మానసికోల్లాసాన్ని పెంపొందుతున్నారు.

టపాసులు.. జాగ్రత్తలు



కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రోజున అందరి ఇళ్లు దీపాలతో, టపాసుల మోతతో సంబరాలు మిన్నంటుతాయి. ఈ సంబరాల్లో అపశ్రుతులు జరుగకుండా జాగ్రత్తలు తీసుకుంటే దీపావళి పండుగ ఆనందోత్సాహాల మధ్య హాయిగా గడిచిపోతుంది. ముఖ్యంగా పిల్లలు టపాసులు కాల్చే సమయంలో తల్లిదండ్రులు, పెద్దలు చాలా జాగ్రత్తగా ఉండాలి. దీపావళి పండుగను సంతోషకరంగా ప్రమాదాల రహితంగా జరుపుకునేందుకు తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తలు...

- సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 8 నుంచి 10 గంటలలోపు టపాసులు కాల్చుకోవాలి.
- టపాసులు కాల్చే సమయంలో కాటన్ దుస్తులు వేసుకోవాలి.
- పెద్దల సమక్షంలోనే పిల్లలు టపాసులు కాల్చాలి.
- టపాసులను ఇంటి బయట, బహిరంగ ప్రదేశంలోనే కాల్చాలి.
- పూర్తిగా పేలని బాంబులపై నీరు లేదా ఇసుకను చల్లి నిప్పును చల్లార్చాలి.
- మండుతున్న క్రాకర్స్‌ను ఎప్పుడు శరీరానికి, బట్టలకు దూరంగా ఉండేట్లు చూసుకోవాలి.
- రాకెట్స్, ఫైర్ క్రాకర్స్‌ను గుడిసెలు, పెట్రోల్‌బంక్‌లకు దూరంగా కాల్చాలి.
- టపాసులపైకి వంగి నిప్పు అంటించొద్దు.
- దుస్తులకు నిప్పు అంటుకున్నట్లయితే పరుగెత్తవద్దు. నేలపై దొర్లాలి. దుప్పటి చుట్టుకోవాలి.
- టపాసులను అగ్గిపుల్లలకు, దీపాలకు, గ్యాస్‌సిలండర్లకు దూరంగా ఉంచాలి.
- టపాసులు కాల్చే స్థలంలో రెండు బకెట్ల నీటిని ఉంచుకోవాలి.
- రాకెట్లను ఆకాశంలోకి వెళ్లేలా కాల్చాలి. పక్కకు పెట్టి కాల్చితే ఇళ్లలోకి దూసుకెళ్లి అగ్నిప్రమాదాలు జరిగే అవకాశ ఉంది.
- టపాసులను చేతిలో పట్టుకుని నిప్పు అంటించొద్దు

టపాసుల దుకాణాల లైసెన్స్‌దారులు పాటించాల్సిన నిబంధనలు

- టపాసుల షాపులను లే అవుట్ ప్రకారం జీఐ షీట్లతో అగ్ని ప్రమాద రహితంగా ఏర్పాటు చేయాలి.
- దుకాణాలు ఏర్పాటు స్థలంలో వాహనాల పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసుకోవాలి.
- ఏదైనా ప్రమాదం జరిగిన సందర్భంలో ఫైర్ ఇంజన్ వెళ్లే విధంగా దుకాణాల మధ్య దారి, ప్రమాదం జరిగిన సమయంలో మంటలు ఒక దుకాణం నుంచి మరో దుకాణానికి వ్యాపించకుండా ఖాళీ స్థలం మూడు మీటర్ల వరకు వదిలి దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రతి దుకాణంలో రెండు ఫైర్ ఎస్టింగిషర్స్ (5 కిలోల సామర్థ్యం) పరికరాలు సిద్ధంగా ఉండాలి.
- 200 లీటర్ల నీటితో నిండిన రెండు వాటర్ బ్యారెల్స్, మూడు వాటర్ బకెట్స్, మూడు ఇసుక బకెట్స్ షాపు వద్ద ఏర్పాటు చేయాలి.
- టపాసుల షాపులో 18 ఏళ్లలోపు ఉన్నవారిని పనిలో పెట్టుకోకూడదు.
- విదేశీ టపాసులు విక్రయించవద్దు
- విద్యుత్ సరఫరాకు సంబంధించి లూజ్ వైరింగ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- దుకాణాల్లో ఎల్ఈడీ బల్బులను వినియోగించాలి.

జిల్లా జైలుకు 10 టీవీలు అందజేసిన కలెక్టర్



జైలు అధికారులకు టీవీలను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కరీంనగర్ జిల్లా జైలును కలెక్టర్ పమేలా సత్పతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 10 స్మార్ట్ టీవీలను జైలు సూపరింటెండెంట్ కె శ్రీనివాస్‌కు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జైలులోని ఖైదీల బ్యారక్‌లు తిరుగుతూ వారికి కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కిచెన్, క్యాంటీన్, ఖైదీలు స్వయంఉపాధి పొందే ఫ్యాక్టరీ, టైలరింగ్ రూములను, టెలిఫోన్ రూమ్, లైబ్రరీ, హాస్పిటల్, బ్యారక్‌లను ఆమె పరిశీలించి జైలులో ఖైదీలకు అందిస్తున్న భోజనం వివరాలను తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌కు వెళ్లి సరుకుల నాణ్యతను పరిశీలించారు. బ్యారక్‌లో టీవీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జైలు జీవితం గడుపుతున్న వారిలో మానసిక ఆందోళనను దూరం చేస్తూ, వారిలో సత్ప్రవర్తనను పెంపొందించేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అన్నారు, అండర్ ట్రయల్ ముద్దాయిలు, ఖైదీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, జైలు నిబంధలకు అనుగుణంగా అన్ని వసతి, సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఖైదీల్లో మార్పు వచ్చేందుకు జైలు వాతావరణం దోహదపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జైలర్లు పి శ్రీనివాస్, బి రమేష్, డిప్యూటీ జైలర్లు ఎ. శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా క్రషర్ నిర్మాణం

● నిర్మాణానికి అక్రమ విద్యుత్ వినియోగం

● విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది



విద్యుత్ వైర్లను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

శంకరపట్నం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్ శివారులో పెద్దగుట్ట వద్ద అనుమతులు లేకుండా చేపట్టిన క్రషర్ నిర్మాణానికి అక్రమ విద్యుత్ వినియోగించిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. కాచాపూర్ శివారులో పెద్ద గుట్టకు క్రషర్ నిర్మాణం పనులు గతంలో జరిగినప్పుడు రైతులు అనుమతులు ఇవ్వవద్దని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు విచారణ చేసి క్రషర్ నిర్మాణ పనులు నిలిపివేశారు. అప్పటి నుంచి కొంతకాలంగా పనులు నిలిపివేసినట్లు సమీప రైతులు తెలిపారు. ఆ మధ్య క్రషర్ యజమాని రాత్రి వేళల్లో చడి చప్పుడు లేకుండా క్రషర్ నిర్మాణానికి అక్రమంగా విద్యుత్ వైర్లు వేసి రాత్రిపూట వెల్డింగ్ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈవిషయాన్ని గమనించిన రైతులు ట్రాన్స్‌కో అధికారులకు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి వచ్చి పెద్ద గుట్ట వద్ద పరిశీలించారు. అక్రమంగా విద్యుత్ వైర్లను వేసి వెల్డింగ్ పనులు చేస్తున్నట్లు విద్యుత్ సిబ్బంది గుర్తించి వైర్లను స్వాధీన పరుచుకున్నారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడిన క్రషర్ యజమానిపై కేసు నమోదు చేయనున్నట్లు ఏఈ రఘు తెలిపారు.

● గుట్టు చప్పుడు కాకుండా గుట్ట పక్కకు చెట్ల పొదల్లో గుడుంబా స్థావరం ఏర్పాటు చేశారు. అనుమతులు లేకుండా చేపట్టిన క్రషర్ నిర్మాణం పనులు పరిశీలించడానికి వెళ్లిన గ్రామస్థులు అక్కడే చెట్ల పొదల్లో గుడుంబా స్థావరాన్ని గమనించారు. దీంతో సంబంధిత వ్యక్తిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

జిల్లా స్థాయి కబడ్డీ, హాకీ సెలక్షన్స్

హుజూరాబాద్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): నవంబరు 2న హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ గ్రౌండ్‌లో జిల్లా స్థాయి అండర్-14 బాల బాలికలు కబడ్డీ, అండర్-17 బాల బాలికల హాకీ సెలక్షన్స్ నిర్వహిస్తున్నామని ఎంఈవో బి శ్రీనివాస్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ జిల్లా సెక్రటరీ సొల్లు సారయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరందరికి పోటీలు నిర్వహించి సెలక్షన్స్ చేస్తామని పేర్కొన్నారు.

బాలసదన్ సందర్శన

కరీంనగర్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి కె వెంకటేశ్ ఆధ్వర్యంలో నగరంలోని బాలసదన్, శిశుగృహాలను మంగళవారం సందర్శించారు. వంట, ఆహార పదార్థాలను నిల్వ చేసే గదులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, బాలసదన్, శిశుగృహ సిద్దంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ పాఠశాల విద్యార్థులు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ అసోసియేషన్ వారు నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలో మణికంఠ, అశ్విత్, జయశ్రీలు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

హత్యాయత్నం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కిసాన్‌నగర్‌లో సోమవారం అర్ధరాత్రి బైక్‌పై వెళుతున్న దంపతులపై అదే ప్రాంతంలో నివాసం ఉంటున్న నిందితుడు ఆటోతో ఢీకొట్టి, కత్తితో గాయపరిచాడని కరీంనగర్ మూడో టౌన్ సీఐ జాన్‌రెడ్డి తెలిపారు. కిసాన్‌నగర్‌కు చెందిన ఎండీ చున్ను, ఎండీ రెహనాలు రాత్రి 11:30 గంటలకు బైక్‌పై వెళుతుండగా నిందితుడు శివకృష్ణ తన ఆటోతో వెనుక నుంచి ఢీకొట్టాడు. కిందపడిపోయిన ఆ దంపతులను కత్తితో గాయపరిచి హత్యాయత్నం చేశాడు. అత్తామామల మూలంగానే తన భార్య తన వద్దకు రావటంలేదనే కక్షతో వారిపై దాడి చేసి గాయపరిచారని సీఐ తెలిపారు. బంధువు ఇచ్చిన ఫిర్యాదుతో శివకృష్ణపై నమోదు చేసి, అరెస్టు చేసినట్టు సీఐ తెలిపారు.

'బ్రెయిన్ స్ట్రోక్ పేషంట్‌ను రికవరీ చేయవచ్చు'



మాట్లాడుతున్న డాక్టర్ సంజయ్ కమిన్వర్

సుభాష్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన పేషంట్‌ను నాలుగు గంటల్లో ఆసుపత్రికి తీసుకువస్తే రికవరీ చేసే అవకాశం ఉంటుందని మెడికవర్ ఇంటర్వెన్షనల్ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ సంజయ్ కమిన్వర్ తెలిపారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన నగేష్(40) అనే వ్యక్తికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన నాలుగు గంటల్లోపు ఆసుపత్రికి తీసుకువచ్చారని, వెంటనే ఆయనకు డయాగ్రసిస్ చేసి ఐవీ త్రాంబోలసిస్ ఇంజక్షన్ ఇచ్చి మూడు రోజుల్లో రికవరీ చేశామన్నారు. పెద్దపల్లి జిల్లా గురాంపల్లికి చెందిన అనిల్(27) ఫిట్స్‌తో బాధపడుతూ ఆసుపత్రికి రాగా, బ్రెయిన్ స్ట్రోక్ కూడా వచ్చిందని తెలిపారు. ఆ సమయంలో ఆసుపత్రిలో ఉండడంతో వెంటిలేటర్ సహాయంతో రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఇద్దరు పేషంట్లు ఇపుడు నార్మల్‌గా ఉన్నారని తెలిపారు. సమావేశంలో డాక్టర్ ఉపేందర్‌రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ హెడ్ కోట కరుణాకర్ పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తిమ్మాపూర్(మానకొండూర్), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ బాధిత కుటుంబానికి ఐదు లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెక్కును రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం అందించారు. ఉపాధి కోసం సౌదీ అరేబియాకు వెళ్లి మృతి చెందిన చొప్పదండి మండలంలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన పులి అంజయ్య మృతి చెందాడు. ఈ సందర్భంగా తిమ్మాపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అతడి భార్య రేణుకకు రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును పంపిణీ చేశారు. ఇలాంటి చెక్కును పంపిణీ చేయడం రాష్ట్ర చరిత్రలో మొదటిసారి అని దీనికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ పమేలా సత్పతి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ నమోదు సెల్ ప్రారంభం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ నమోదుకు జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాలు, విభాగాల అధ్యక్షులతో కలిసి డీసీసీ కార్యాలయంలో పట్టభద్రుల ఓటర్ నమోదు కోసం ప్రత్యేక సెల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పర్యవేక్షణ కమిటీసభ్యులు మడుపు మోహన్ పలువురు పట్టభద్రులు ఫామ్ 18 ఓటరు నమోదు దరఖాస్తు ఫారంలను అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాలు, విభాగాల అధ్యక్షులు కర్ర సత్యప్రసన్నారెడ్డి, పడాల రాహుల్, ఎండీ తాజుద్దీన్, పులి అంజనేయులుగౌడ్, పురం రాజేశం పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు కావాలి

కరీంనగర్ టౌన్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు నవంబర్ 6వ తేదీ చివరిరోజని ఆలోగా పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ కోరారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కుట్రలో పోలీసులు పావులుగా మారుతున్నారని ఆరోపించారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వచ్చిన వ్యతిరేకత దృష్టిమళ్ళించేందుకు రేవంత్‌రెడ్డి కేటీఆర్ కుటుంబసభ్యులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, పెండ్యాల మహేశ్, కెమసారం తిరుపతి, గొట్టం మహేశ్, పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరి జయంతి ఉత్సవాలు

వీణవంక అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరులో నాయీబ్రాహ్మణ సంఘం అధ్వర్యంలో ధన్వంతరి జయంతి ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎంపీలను సన్మానించారు. కార్యక్రమంలో ముత్యాల సతీష్, నారాయణదాస్ కార్తిక్, రవీందర్, తూముల శ్రావణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చీకటి వెలుగుల రంగేళి.... జీవితమే ఓ దీపావళి

(5వ పేజీ తరువాయి)

పూలు విభిన్న రకాలను బట్టి 30 నుంచి 60 రూపాయల వరకు అమ్ముతున్నారు. బంతి, చేమంతి పూలను కుప్పలుగా పోసి అమ్ముతున్నారు. 100 గ్రాములకు 50 రూపాయల నుంచి 70 వరకు పలుకుతున్నాయి. పూజలకు అమ్మకందారులు వేటికవే ప్యాక్‌చేసి అమ్ముతున్నారు. ఒక్కో ప్యాక్ ఆయా పూజకు సంబంధించి 1,500 రూపాయల నుంచి రెండు వేల రూపాయల వరకు అమ్ముతున్నారు. ఆయాచోట్ల రకరకాల ప్రమిదలతోపాటు వత్తులు, నూనె అమ్మడంతో అన్నీ ఒకే చోట కొనుగోలు చేస్తున్నారు. దీపపు ప్రమిదలు, టపాసులు, పూజాసామగ్రి అమ్మకాలతో మార్కెట్‌లో సందడి నెలకొంది

జీప్యాట్, నైపర్ ర్యాంకర్లను అభినందించిన వీసీ



జీప్యాట్ నైపర్ ర్యాంక్‌లు సాధించిన విద్యార్థినులతో వీసీ, తదితరులు

గణేశ్‌నగర్, అక్టోబర్ 29 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ చదివి జీప్యాట్, నైపర్ పరీక్షల్లో అఖిలభారత స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య యు ఉమేష్‌కుమార్ అభినందించారని కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో జరిగిన కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన ఇద్దరు విద్యార్థులు వై స్నేహ, జి నందినిలకు దాతల సహకారంతో వీసీ ల్యాప్‌టాప్‌లను బహూకరించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన మరో ఇద్దరు విద్యార్థులు యం సాయికిరణ్, బి పల్లవిలకు పది వేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని విశ్వవిద్యాలయం తరపున బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా కె శ్రీశైలం, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై కిశోర్, అధ్యాపకులు పి శ్రకాంతి రాజు,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

'గంగుల'కు మంత్రి పొన్నం పరామర్శ



నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాతృమూర్తి గంగుల నర్సమ్మ గారు ఇటీవల అన్యారోగ్యంతో మృతి చెందారు. ఆయనను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా గంగుల నర్సమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ మంత్రి గంగుల కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి పరామర్శించారు.

● కార్పొరేటర్ పిట్టల శ్రీనివాస్ తల్లి రాజమ్మ ఇటీవల మరణించగా ఆమె చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం నివాళులర్పించారు.

ఎరుకల ప్రజాసమితి మహిళా కమిటీ ఎన్నిక

సుభాష్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎరుకల ప్రజా సమితి జిల్లా మహిళ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కుతాడి కోమల, ప్రధానకార్యదర్శిగా కెమసారం భాగ్య, ఉపాధ్యక్షులుగా దాసరి విజయ, లోకిని లక్ష్మి, కట్ట జ్యోతి, అంగిడి లక్ష్మి, కుర్ర తిరుపతమ్మ, దుగ్యాల తిరుమల, సహాయ కార్యదర్శులుగా లోకిని రమ, లోకిని లక్ష్మి, బండి రాజేశ్వరి, లోకిని సారవ్వ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుర్ర మంజుల, ప్రచార కార్యదర్శులుగా దుగ్యాల నవ్య, జగిత్యాల ఇన్‌చార్జిగా లోకిని లావణ్య లోకిని వసంత, సిరిసిల్ల జిల్లా ఇన్‌చార్జిగా అనుముల తేజశ్రీ, ఆవుల అక్షయలను ఎన్నుకున్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

గణేష్‌నగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే మంత్రి ఇల్లు ముట్టడిస్తామని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంత గణేష్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని ఎస్ఆర్ఆర్ కళాశాల ముందు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే విద్యార్థులను విస్మరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అభిలాష్, ఉమామహేశ్వర్, గణేష్, జిల్లా సహాయ కార్యదర్శి కుమార్, స్వామి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

భగత్‌నగర్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలోని ఎలగందల్, కమాన్‌పూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పిఎసిఎస్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డితో కలిసి కరీంనగర్ అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు మడుపు మోహనాచారి, కొత్తపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పంజాల స్వామిగౌడ్, బీసీ సెల్ అధ్యక్షుడు గుండ మల్లేశం, గ్రామ అధ్యక్షుడు ఆరె మల్లేశం, పీఏసీఎస్ వైస్ చైర్మన్ బీరం అంజనేయులు, కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు సిరిపురం నాగప్రసాద్ పాల్గొన్నారు.

● సైదాపూర్ (ఆంధ్రజ్యోతి): రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం నిర్వహించే కొనుగోలు కేంద్రాలలో అమ్ముకుంటేనే మద్దతు ధర లభిస్తుందని వెన్కేపల్లి విశాల సహకార సంఘం చైర్మన్ కొత్త తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలో వెన్కేపల్లి ఎల్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే 16 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. మండలంలోని దుద్దెనపల్లి, సైదాపూర్, జాగీర్‌పల్లి, రాంచంద్రాపూర్, ఎలబోతారం, రాములపల్లి, గుజ్జులపల్లి, గొడిశాల, గుండ్లపల్లి, బొమ్మకల్, రాయికల్, రాయికల్ తండా, ఘనపూర్, వెంకటేశ్వర్లపల్లి, పెర్కపల్లి, శివరాంపల్లి ధాన్య కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి, ట్రస్మా మాజీ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఫీజు దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజురీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిపు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పట్టభద్రుల, నిరుద్యోగుల, విద్యార్థుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నానని, పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదై తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

● ఎస్ఎఫ్ఐ ఫీజు దీక్షకు సంఘీభావం..

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన ఫీజు దీక్ష శిబిరాన్ని ఆల్ ఇండియా రెడ్డి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి సందర్శించి విద్యార్థులకు సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ సమావేశంలో గ్రామస్థుల ఆందోళన

● చైర్‌పర్సన్ హామీతో ఆందోళన విరమించిన బోర్నపల్లి వాసులు



నిరసన తెలుపుతున్న బోర్నపల్లి గ్రామస్థులు

హుజూరాబాద్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బోర్నపల్లి గ్రామస్థులు సమావేశంలో ఫ్లకార్డ్స్‌తో ఆందోళన చేశారు. హుజూరాబాద్ కాకతీయ కెనాల్ నుంచి బోర్నపల్లి శివారు వరకు ఆర్అండ్‌బీ రోడ్ వెంట ఎయిర్ వాల్స్, గెట్‌వాల్స్ విద్యుత్ స్తంభాలు ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక కలుగజేసుకొని జూలై 9న తీసివేయాలని మున్సిపల్ పాలకవర్గం అమోదం తెలిపిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

నిర్లక్ష్యం వహించిన సదరు అధికారులను మున్సిపల్ శాఖకు సరెండర్ చేస్తామన్నారు. వెంటనే ఈ సమస్యను పరిష్కరిస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక హామీ ఇవ్వడంతో ఆందోళన విరమింపజేశారు.

● పలు అంశాలకు అమోదం...

హుజూరాబాద్ మున్సిపల్ సాధారణ సమావేశంలో 16 అంశాలను ప్రస్తావించగా, 15 అంశాలను పాలకవర్గం అమోదం తెలిపింది. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 7.16లక్షలతో ప్రధాన రోడ్లపై సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ రిపేరు, రూ. 10లక్షలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నుంచి డీసీఎంఎస్ కాంప్లెక్స్ వరకు మురికి కాలువ నిర్మాణం, నీటి సరఫరా నిర్వహణకు రూ. 47,200, చెడిపోయిన మోటర్లను రిపేరు చేయుటకు, బ్లీచింగ్ పౌడ్ కొనుగోలుకు రూ. 75,953 అమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఏఈ సాంబరాజు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అశ్వినీగాంధీ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు ఎంపిక



అభినందిస్తున్న డాక్టర్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్ఈ) విద్యార్థినులు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ జట్టుకు సబ్‌జూనియర్ విభాగంలో ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన నిఖితయాదవ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి, హ్యాండ్‌బాల్ కోచ్ కవిత, విద్యార్థులు పాల్గన్నారు.

ఎస్‌యూ పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 2024లో నిర్వహించిన ఎంఎస్సీ (ఫిజిక్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్) రెండు. నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ మంగళవారం విడుదల చేశారు. ఫలితాలు శాతవాహన యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బీఆర్ఎస్ పోరాటానికి తలొగ్గిన ప్రభుత్వం

చొప్పదండి, అక్టోబరు 29: (ఆంధ్రజ్యోతి) బీఆర్ఎస్ పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం తలొగ్గిందని మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ అన్నారు. మంగళవారం అయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలపైన వేయాలనుకున్న విద్యుత్ చార్జీల రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవడం బీఆర్ఎస్ విజయం అన్నారు.

హుజూరాబాద్: విద్యుత్ చార్జీలను పెంచవద్దని బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆందోళనకు ప్రభుత్వం తలొగ్గినందుకు హర్షిస్తూ బీఆర్ఎస్ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద సంబరాలు నిర్వహించారు.

జాబ్ మేళాలు నిర్వహించడం అభినందనీయం: కలెక్టర్

గణేశ్‌నగర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల కల్పనకు జాబ్ మేళాలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో వైష్ణవి టెక్నాలజీస్, కాసాని ఫౌండేషన్, మైత్రి చానల్ సంయుక్తంగా నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా వాల్ పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.

నవంబర్ 3వ తేదీన టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో మెగా జాబ్ మేళాను చేపట్టనున్నామని వైష్ణవి టెక్నాలజీస్ చైర్మన్ శ్రీకాంత్ కొడిత్యాల అన్నారు. దాదాపు 100 కంపెనీలు హాజరుకానున్నాయన్నారు. ఐటీ, బ్యాంకింగ్, మార్కెటింగ్, టెక్నికల్ మ్యాన్ ఫ్యాక్చరింగ్ రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, వైష్ణవి టెక్నాలజీస్ ఎండీ విజయరఘురామరాజు, జాబ్ మేళా కో ఆర్డినేటర్ పుల్లూరి చందర్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యోగా పతక విజేతకు ఘన స్వాగతం



దీపక్‌కు స్వాగతం పలుకుతున్న క్రీడాభిమానులు

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 29: జాతీయస్థాయి సబ్ జూనియర్ యోగా పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన పురాణం దీపక్‌కు, కోచ్ రామకృష్ణకు ఘన స్వాగతం లభించింది. ఈ నెల 24 నుంచి 27 వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాలో జరిగిన జాతీయ స్థాయి యోగాసనా పోటీల్లో కరీంనగర్‌కు చెందిన దీపక్ పసిడి పతకం కైవసం చేసుకున్నాడు. మంగళవారం సాయంత్రం వరంగల్ రైల్వేస్టేషన్‌కు చేరిన దీపక్‌ను తెలంగాణ యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి పూల మాలతో స్వాగతం పలికారు. అనంతరం కరీంనగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలంగాణ, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో పలు క్రీడా సంఘాల బాధ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్, తెలంగాణ యోగా అసోసియేషన్ కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, మానకొండూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ కన్వీనర్‌గా జిల్లా కేంద్రానికి చెందిన వంచ శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ప్రధాన కార్యదర్శి బక్కని నర్సింహులు నియామక ఉత్తర్వులను జారీచేశారు. దీంతో పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

'అన్ని రంగాల్లో వెనకబడిన మాలలు'

సుభాష్‌నగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మాలలు అన్నిరంగాల్లో వెనకబడిపోయారని మాలల ఐక్యత అభివృద్ధి సమావేశం కన్వీనర్ ఈసరి జనార్దన్ అన్నారు. మంగళవారం స్థానిక శర్మనగర్‌లోగల ప్రజామిత్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ కార్యాలయంలో సమావేశం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబరు 24న భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా నవంబరు 3న జిల్లా కేంద్రంలోని పద్మనాయక కళ్యాణ మండపంలో మాలల అభివృద్ధి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు అర్వ మల్లేశం, గంట శ్రీనివాస్, కొరివి వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.

బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని నిరసన

గన్నేరువరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామ శివారులోని మైసమ్మగుట్ట వద్ద నుంచి మానేరు డ్యాంపై కరీంనగర్‌కు బ్రిడ్జిని నిర్మించాలని బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ గ్రామస్థులతో కలిసి మంగళవారం నిరసన చేపట్టారు. చొక్కారావుపల్లి నుండి బ్రిడ్జి వేస్తే తక్కువ గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందని అధికారులు దీనిపై దృష్టి సారించి మైలారం మైసమ్మగుట్ట నుంచి అధికారులు రీసర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మైలారం గ్రామస్థులు పాల్గొన్నారు.

యువ ఆవిష్కర్తకు సన్మానం



సన్మానిస్తున్న ఈవీ నర్సింహారెడ్డి

కరీంనగర్ టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పారమిత విద్యార్థిని, యువ ఆవిష్కర్త శుభశ్రీసాహును పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఈవీ నర్సింహారెడ్డి సన్మానించారు. హైదరాబాద్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయం లో జరిగిన కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ జి రమేశ్, శుభశ్రీసాహు తోపాటు ప్రాజెక్టు మెంటార్ లలిత్ మోహన్‌సాహులు పాల్గొన్నారు. ఇటీవల శుభశ్రీసాహును ఢిల్లీలో భారత ప్రభుత్వం సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రతిష్ఠాత్మక ఇన్‌స్పైర్ అవార్డు మనక్ జాతీయ అవార్డుతో సత్కరించింది. విద్యార్థినిని పారమిత విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇ ప్రసాద్‌రావు, పాఠశాల డైరెక్టర్లు అభినందించారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్ లీగల్: హుజూరాబాద్ కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న జీడీ రవితేజను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర లీగల్ సెల్ జాయింట్ కన్వీనర్‌గా నియమించారు. మంగళవారం రవితేజను హుజూరాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులు శాలువాతో సన్మానించారు.

● రామడుగు: మండల కేంద్రంలో మంగళవారం ఆర్ఎస్ఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పథసంచలన్ నిర్వహించారు.

● గణేశ్‌నగర్: శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేష్‌కుమార్‌ను డాక్టర్ బీఎస్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు.

- శాతవాహన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఉమేష్‌కుమార్ ను తెలంగాణ ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్‌కు బుధవారంతో గడువు ముగుస్తుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి, కోఆర్డినేటర్ మనోజ్‌కుమార్ ప్రకటనలో తెలిపారు.

- శాతవాహన యూనివర్సిటీ సైన్స్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి సపాల ఆర్గానిక్స్ చైర్మన్ డాక్టర్ ఎల్లారెడ్డి, ఎస్‌యూ వీసీ ఉమేశ్‌కమార్ ముఖ్యఅతిథిలుగా హాజరై మాట్లాడారు.

● తిమ్మాపూర్(మానకొండూర్): జన్వాడ ఫాంహౌస్ యజమాని రాజ్ పాకాలతో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు సంబంధాలున్నాయని డీసీసీ కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్, కేడీసీసీబీ డైరెక్టర్ అలువాల కోటి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి ఆరోపించారు.

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాడుగుల ఓదెలు హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ నేషనల్ అవార్డు అందుకున్నారు.

- మండలంలోని పద్మశాలి సంఘం శాలపల్లి గ్రామ అధ్యక్షుడు జడల చిరంజీవి తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ ప్రచార కార్యదర్శిగా, సభా నిర్వహణ ప్రోటోకాల్ పర్యవేక్షకుడిగా నియమితులయ్యారు.

● గన్నేరువరం: అగ్రికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో ఖాసింపేట రైతువేదికలో అధిక దిగుబడినిచ్చే మొక్కజొన్న విత్తనాలను రైతులకు అందజేశారు.

● భగత్‌నగర్: ధాన్యం కొనుగోలు జాప్యంలో కుట్ర దాగి ఉందని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు ఒక ప్రకటనలో విమర్శించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క గింజ ధాన్యాన్నీ కొనలేదన్నారు.

● కరీంనగర్ రూరల్: మండలంలోని చామనపల్లి రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై శిక్షణ ఇచ్చారు.

- మండలం నగునూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల కళాశాలలో జాతీయ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు.

- కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ లేకుండా ప్రారంభోత్సవాలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు మాడిశెట్టి విమర్శించారు.

● సుభాష్‌నగర్: రీజినల్ కాన్ఫరెన్స్ రీకాన్ ఉత్సవంలో వాగ్దేవి క్లబ్‌కు ఫస్ట్ బెస్ట్ క్లబ్ అవార్డు లభించింది.

● మానకొండూర్: మండలంలోని కొండపల్కలకు చెందిన జనగాం నర్సయ్యగౌడ్ అనే గీతకార్మికుడికి ఈత చెట్టు పైనుంచి పడి తీవ్రగాయాలయ్యాయి.